నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 30 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బాలుడి వైద్యానికి సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు

తాండూర్, జనవరి 29 : మాదారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోలవేణి రవీంద్ర కుమారుడు (2 నెలలు) కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించే స్థోమతలేకపోవడంతో యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. దాతల ద్వారా సేకరించిన రూ. 26 వేలను బాలుడి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు. ఆర్థికసాయమందించి అండగా నిలిచిన యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులకు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ ఇన్‌చార్జిలు జీవన్ కుమార్, రోషన్, ప్రణీత్ ఉన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో ఫ్లడ్‌లైట్‌ల వెలుతురులో నిర్వహిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై చివరి రోజు పోటీలు ప్రారంభించారు. ఉట్నూర్ జట్టు మొదటి స్థానంలో నిలువగా, రెండో స్థానంలో ఎసన్వాయి, మూడో స్థానంలో మంచిర్యాల జట్లు నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, ట్రినిటీ హైస్కూల్ అధినేత బీజూ కురివిల్లా, పోరెడ్డి రాజు, మెట్టపల్లి సురేందర్, మహేశ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బెల్లంకొండ మురళి, బోరె యాదగిరి, రావుల రాంమోహన్ పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకుందామంటూ నినదిస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జాతీయ అధ్యక్షుడు రాములు యాదవ్

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : యాదవుల అభివృద్ధి, సంక్షేమం కోసం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రెండో విడుత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొదటి విడుత డీడీలు తీసిన వారికి గొర్రెల యూనిట్లు అందజేయగా, రెండో విడుత డీడీలు తీసిన గొల్లకుర్మలకు వెంటనే గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరారు. గొల్లకుర్మలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరివేన సంపత్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుడి సెశ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంయాదవ్, మల్లేశ్ యాదవ్, పర్ల రాజన్న యాదవ్, యూత్ అధ్యక్షుడు చీర్ల శశిందర్ యాదవ్ పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో డా.సుబ్బరాయుడు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల ఏసీసీ, జనవరి 29 : కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.జి.సుబ్బారాయుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్ల ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.నీరజ, డా.అనిత, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూరియా అలాట్‌మెంట్ అడ్డదిడ్డం

చెన్నూర్ వ్యవసాయ డివిజన్‌లో భారీగా అవకతవకలు

- కాసులకు కక్కుర్తిపడి ఇష్టారాజ్యంగా కేటాయింపు
- లోడ్‌ల కొద్దీ తెప్పించుకొని దందా సాగిస్తున్న డీలర్లు
- ఆపై మహారాష్ట్రకు తరలిస్తూ దండుకుంటున్న వైనం
- భారమంతా రైతులపైనే.. ● 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : చెన్నూర్ వ్యవసాయ డివిజన్‌లో యూరియా అలాట్‌మెంట్‌లలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు కాసులకు కక్కుర్తి పడి.. డీలర్లకు ఇష్టం వచ్చినట్లు యూరియా కేటాయిస్తుండగా, వారు తమ వద్ద నిల్వ చేసుకొని.. ఆపై అక్రమ దందా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని జాతీయ రహదారి మీదుగా మహారాష్ట్రకు తరలిస్తూ అందినకాడికి దండుకుంటుండగా, అధికారులు 'మాములు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది.

10 టన్నులకు మూడు నుంచి ఆరు వేలు..

ఒక డీలర్ తనకు యూరియా కావాలని మండల వ్యవసాయాధికారికి సమాచార మిస్తే.. ఆ దుకాణంలో ఉన్న యూరియా.. ఆధారంగా ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. ఒక వేళ మండల వ్యవసాయాధికారి యూరియా ఇండెంట్ పెట్టినా.. అది ఏడీఏ స్థాయిలో ఆగడం.. ఒకవేళ అక్కడి నుంచి డీఏవో కార్యాలయానికి ఇండెంట్ పెట్టినా అదే పరిస్థితి ఉంటుందని పలువురు చెబుతున్నారు. మండల స్థాయి నుంచి డీఏవో కార్యాలయ సిబ్బంది వరకు చేతి తడిపితేనే పని చేసి పెడుతారట. డీఏవో కార్యాలయంలోని టెక్నికల్ ఏవో, సెక్షన్ అధికారితో పాటు మరికొందరికి ముడుపులు ఇవ్వనిదే అలాట్‌మెంట్ కాదట. 10 టన్నుల యూరియా కేటాయింపునకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేల దాకా వసూలు చేస్తున్నారని పలువురు చెప్పడం గమనార్హం. ఈ విషయంపై డీలర్లు ఎంతెంత సమర్పించుకున్నారో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే అసలు విషయం బయటపడనున్నది.

భారమంతా రైతులపైనే..

డీలర్ల నుంచి అధికారులు ముడుపుల రూపంలో దండుకుంటుంటే.. సదరు డీలర్లు ఈ మొత్తాన్ని రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక యూరియా బస్తాకు రూ. 253కు సొసైటీలకు వస్తుంది. ప్రైవేటు డీలర్లకైతే అదనంగా ట్రాన్స్‌ఫోర్టేషన్, హమాలీ రూపంలో బస్తాకు రూ. 20 నుంచి రూ. 30 పడుతుంది. కానీ మార్కెట్లో ఒక్కో యూరియా బస్తాకు రైతుల వద్ద నుంచి రూ. 330 నుంచి రూ. 350 వసూలు చేస్తున్నారు. ఇంత ఎందుకంటే ఒక లోడు యూరియా రావాలంటే కింది నుంచి మీది వరకు డబ్బులివ్వాల్సి వస్తుందని, డబ్బులివ్వకుంటే ఇండెంట్ పెట్టినా అలాట్‌మెంటు ఇవ్వరని నేరుగా పేరు చెప్పేందుకు ఇష్టపడని పలువురు డీలర్లు చెబుతున్నారు. మహారాష్ట్ర బార్డర్ డివిజన్ కావడంతో హాకా, ఆగ్రోస్, డీసీఎంఎస్ సొసైటీల్లో కూడా అధిక ధరకు విక్రయిస్తున్నారు. రైతులను అడిగితే ఈ వివరాలన్నీ బయటపడే అవకాశమున్నది.

చెన్నూర్ టు మహారాష్ట్రకు..

చెన్నూర్ మండల కేంద్రం ఆది నుంచి కమర్షియల్ పాయింటే. ఇటు వ్యాపారానికి, నకిలీ విత్తనాలకే కాకుండా తెలంగాణ రాష్ట్ర యూరియా సైతం టన్నుల కొద్దీ మహారాష్ట్రకు తరలుతుంది. సంబంధిత శాఖ అధికారుల అండదండలతోనే ఈ దందా నడుస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల ఇద్దరు ఏఈవోల అండదండలతో చెన్నూర్ మండల కేంద్రం నుంచి యూరియా లోడ్ మహారాష్ట్రకు తరలింది. ఇది ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. కొందరు హోల్‌సేల్ డీలర్లు డమ్మీ ఇన్‌వాయిస్‌ల పేరిట యూరియాను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బావురావుపేటలో హాకా పేరిట ఒక ఫర్టిలైజర్ దుకాణానికి లైసెన్సు తీసుకున్న డీలర్‌కు చెన్నూర్ సమీపంలో ఒక ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణం కూడా ఉంది. హాకా సొసైటీ పేరిట యూరియా అలాట్‌మెంటు తీసుకొని.. దానిని తన ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసి వ్యాపారం సాగిస్తున్నాడు. ఇలా లోడ్‌లకు లోడ్‌లు హోల్‌సేల్ వ్యాపారులతో కుమ్మక్కై జోరుగా జీరో దందా సాగిస్తున్నాడు. చెన్నూర్ డివిజన్‌లోని కోటపల్లి, చెన్నూర్ మండలాలకు గతేడాది, ఈ ఏడాది వానకాలంలో యూరియా అలాట్‌మెంట్‌లు పరిశీలిస్తే అసలు విషయం బయటపడనున్నది. 2022-23 వాన కాలం సీజన్‌లో హాకా ఎఫ్ఎస్‌సీ చెన్నూర్‌కు 220 మెట్రిక్ టన్నులు, బావురావుపేటకు 60 మెట్రిక్ టన్నులు, కోటపల్లి మండలం హాకా సర్వాయిపేటకు 280 మెట్రిక్ టన్నులు పంపించారు. యాసంగిలో హాకా ఎఫ్ఎస్‌సీ చెన్నూర్‌కు 300 మెట్రిక్ టన్నులు, బావురావుపేటకు 40 మెట్రిక్ టన్నులు, కోటపల్లి మండలం హాకా సర్వాయిపేటకు 220 మెట్రిక్ టన్నులు పంపించారు. 2023-24 వానకాలంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు బావురావుపేటలోని హాకా దుకాణానికే సుమారు 200 మెట్రిక్ టన్నులకుపైనా యూరియా అలాట్ చేశారు. చెన్నూర్ డివిజన్‌లో ఇలాంటివి మరెన్నో ఉన్నాయి. కానీ మిగితా ఎఫ్ఎస్‌సీలకు తక్కువ మొత్తంలో అలాట్ చేయడంపై అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

యూరియా అలాట్‌మెంట్ ఎలా..

సొసైటీలకు యూరియా అలాట్‌మెంట్ అనేది ఏరియా వారీగా సీజన్‌కు ముందుగానే ప్రణాళిక తయారు చేసి మండలాధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందిస్తారు. సదరు అధికారులు ఆయా మండలాల అవసరాన్ని బట్టి కేటాయించాలి. కానీ అలా జరుగడం లేదు ఎవరు డబ్బులిస్తే వారికి.. ఎంత కావాలంటే అంత ఇవ్వడం జరుగుతుంది. గతేడాది వానకాలం, యాసంగి, ఈ ఏడాది వానకాలం డీఏవో కార్యాలయ అధికారులు ఇచ్చిన అలాట్‌మెంట్ చూస్తే అర్థమవుతుంది. జిల్లా అధికారి కార్యాలయంలోని ఉన్నతాధికారితో పాటు యూరియా కేటాయింపులు చేసే టెక్నికల్ వ్యవసాయాధికారి, సదరు సెక్షన్ అధికారుల చేతివాటంతోనే ఇదంతా నడుస్తున్నట్లు సమాచారం.

అవసరాల మేరకే పంపించాం

మండల, డివిజన్ స్థాయి అధికారులు ఇచ్చిన ఇండెంట్‌లను పరిశీలించి అక్కడి అవసరాల మేరకే యూరియాను అలాట్ చేశాం. మేం ఇచ్చిన ప్రకారమే మార్క్‌ఫెడ్ నుంచి యూరియా ఆయా సొసైటీలకు పంపించారు. యూరియా పక్క రాష్ట్రాలకు తరలుతున్నట్లు మా దృష్టికి రాలేదు. అలాంటివి జరిగితే ఉపేక్షించం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

టెండర్లు పూర్తయినా పనులెందుకు ప్రారంభించలే?

- జడ్పీ చైర్మన్ కృష్ణారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం.. పలు అంశాలపై ప్రశ్నించిన సభ్యులు
- సర్కారు ఆదేశాల మేరకేనంటూ జవాబిచ్చిన అధికారులు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్
- ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు : కలెక్టర్ బోర్కడే హేమంత్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు

హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జడ్పీటీసీ సభ్యులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): టెండర్లు పూర్తయినా.. పనులెందుకు ప్రారంభించలేదంటూ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జడ్పీ అధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావుతో పాటు సభ్యులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేసీఆర్ సర్కారులో మంజూరైన పనులను ఎందుకు ప్రారంభించడం లేదంటూ సభ్యులు ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఇందుకు ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్న స్పందిస్తూ డిసెంబర్ 3 తర్వాత మంజూరైన పనులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు స్పందిస్తూ అభివృద్ధి పనులన్నీ ఒకేసారి చేపట్టడం సాధ్యకాదని, ఆర్థికంగా ఇబ్బందులు కలుగుతాయనే ఉద్దేశంతోనే పనులను ప్రాధాన్యత వారీగా చేపడుతామన్నారు. అలాగే జిల్లాలో అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ శాఖలో 21 పనులు, పంచాయితీరాజ్ శాఖలో 14 పనులు అటవీ శాఖ అనుమలు లేక నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఆసిఫాబాద్ మండలం సుంగాపూర్ రోడ్డు నిర్మాణాన్ని అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, పాత రోడ్డును బాగు చేసేందుకు కూడా అటవీఅధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆరోపించారు. అటవీ అనుమతులు ఇవ్వకపోతే రాత్రికి రాత్రే రోడ్డును పూర్తి చేసామన్నారు. కుమ్రం భీం ప్రాజెక్టు ద్వారా పంటలకు నీరు అందడం లేదని, మానిక్‌గూడ వద్ద కెనాల్ కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. దీనిపై నీటి పారుదల శాఖ ఈఈ గుణవంత్‌రావు స్పందిస్తూ నెలలోగా పనులు పూర్తిచేస్తామని తెలిపారు. దహెగాం జడ్పీటీసీ రామారావ్ మాట్లాడుతూ అందవెల్లి వంతెన త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలం వస్తే దహెగాం మండలానికి రాకపోకలు నిలిచిపోతాయన్నారు. జగన్నాథ్‌పూర్, పీపీరావ్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలని కోరారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వచ్చే వేసవిలో ప్రజలు చేతి పంపుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, అధికారులు స్పందించి ఇంటింటికీ నీరందించేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం తెలియజేయడం లేదన్నారు. అధికారంలో లేనివారిని, గతంలో ఎప్పుడు కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కానివారిని పిలుస్తున్నారేగాని.. అధికారంలో ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులను ఎందుకు పిలువడం లేదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు మాట్లాడుతూ ప్రొటోకాల్ గురించి అధికారులకు సర్క్యులర్ జారీ చేస్తానని, ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అటవీ శాఖ అధికారి టిబ్రివాల్, అన్ని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇటుక ట్రిప్పుల తరలింపు రేట్‌పై గొడవ

- ట్రాక్టర్స్ ఓనర్స్ సమావేశంలో లొల్లి
- శ్రీధర్ తలపై కర్రతో దాడి చేసిన మొహినుద్దీన్ ● అక్కడికక్కడే మృతి

గజవేని శ్రీధర్(ఫైల్)

బెల్లంపల్లిరూరల్, జనవరి 29 : ఇటుక ట్రిప్పుల తరలింపు రేట్‌పై జరిగిన గొడవలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బెల్లంపల్లిలో కలకలం రేపింది. సోమవారం పట్టణంలోని పద్మశాలీభవన్ ఎదురుగా ట్రాక్టర్స్ ఓనర్స్ యజమానులు సమావేశమై ఇటుకల ట్రిప్పు తరలిస్తే ఎంత తీసుకోవాలనేదానిపై చర్చించుకుంటున్నారు. ఈ విషయమై హన్మాన్‌బస్తీకి చెందిన గజవేని శ్రీధర్ (44), రాంనగర్ బస్తీకి చెందిన మొహినుద్దీన్‌ల మధ్య మాటామాటా పెరిగింది. ఒకరినొకరు కొట్టుకుంటున్న క్రమంలో.. మొహినుద్దీన్ కర్రతో శ్రీధర్ తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ యజమానుల మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీయగా, స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ ఎన్.దేవయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారితీసిన పరిస్థితుల గురించి ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీధర్ మృతదేహానికి బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఐడీ కార్డులు అందిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సుబ్బారాయుడు

స్టాఫ్ నర్సులకు ఐడీకార్డులు, పాస్‌ల అందజేత

రేపు ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేయనున్న సీఎం

మంచిర్యాల ఏసీసీ/కోటపల్లి/వాంకిడి, జనవరి 29 : మంచిర్యాల జిల్లా నుంచి ఎంపికైన 266 మంది స్టాఫ్ నర్సులకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఐడీ కార్డులు, పాస్‌లను జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు, కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రావు, డెమె వెంకటేశ్వర్లు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈ నెల 31న హైదరాబాద్‌లోని లాల్‌బహుదూర్ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నారు. కాగా, కోటపల్లి చెందిన కొట్టె శ్రావ్య, మల్లంపేటకు చెందిన సుందిళ్ల శశికళ, నక్కలపల్లికి చెందిన సీహెచ్ మహేశ్, సూపాక గ్రామానికి చెందిన నల్లగుంట శ్రావణి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాగే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలానికి చెందిన కొదురూపక లావణ్య, సునీతతో పాటు మరో ఇద్దరు స్టాఫ్ నర్సు ఉద్యోగాలు సాధించారు.

ఐడీ కార్డులు అందుకునేందుకు వచ్చిన ఉద్యోగులు

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సాగాలి

మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా బోధన, రివిజన్, ప్రిపరేషన్ చేయించాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, బెల్లంపల్లి, కాసిపేట, తాండూరు, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్, మోడల్ స్కూళ్ల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతి పాఠశాలలో పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పరీక్షలకు ఎలా సంసిద్ధులను చేయాలో హెచ్ ఎంలు రివ్యూ చేస్తూ 100 శాతం ఫలితాలు సాధించడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కచ్చితంగా నిర్వహిస్తూ రివిజన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీజీఈ దామోదర్ రావు, డీసీఈబీ సెక్రటరీ కొండు భీంరావు, ఎంఈవోలు తిరుపతి రెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్, మహేశ్వర్ రెడ్డి, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, యశోధర పాల్గొన్నారు.

దివికేగిన రాజకీయ దిగ్గజం

- మాజీ పీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మృతి ● నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ నేతలు
- సంతాపం తెలిపిన మాజీ మంత్రి అల్లోల ● హైదరాబాద్‌లో అంత్యక్రియలు

పీ నర్సారెడ్డి (ఫైల్)

నిర్మల్, జనవరి 29(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాకు చెందిన రాజకీయ దిగ్గజం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో కన్ను మూశారు. సారంగాపూర్ మండలంలోని మలక్ చించోలి గ్రామానికి చెందిన నర్సారెడ్డి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీలో చేరి చిన్న నాటి నుంచే రాజకీయ నేతగా ఎదిగారు. అంచెలంచెలుగా ఎదిగి పీసీసీ సీగా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే స్వర్ణ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి సన్నిహితంగా ఉండేవారు. రాజకీయ దురంధరుడిగా పేరున్న నర్సారెడ్డి అందరితో సఖ్యతగా ఉంటూ పార్టీలకతీతంగా నేటి తరం రాజకీయ నాయకులకు సూచనలు, సలహాలు అందజేసేవారు. ఆరోగ్యం క్షీణించే వరకు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కొంతకాలం నుంచి అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. నర్సారెడ్డి మరణంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. అక్కడికి వెళ్లి పలువురు నివాళులు అర్పించారు.

రాజకీయ ప్రస్థానం

1931 సెప్టెంబర్ 22న నర్సారెడ్డి జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చదివి బీఏ, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూనే నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం పోరాడారు. 1940 సంవత్సరం నుంచే క్రియాశీల రాజకీయాల్లో పాల్గొని మూడు సార్లు నిర్మల్ నియోజకవర్గ శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా, ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. 1972-78 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్‌లో రెవెన్యూ, నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 1962-1978 వరకు వరుసగా నిర్మల్ ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రస్థాయిలో అనేక పదవులను నిర్వహించారు. 1981-85 వరకు ఎమ్మెల్సీగా, 1989-91 వరకు ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నారు.